# ఏకోదరులు

శ్రీ నిష్ఠల సోమయాజులు

న్యాయాధిపతి తీర్పు చెప్పడాని కని లేచి నిలబడ్డాడు. కోర్టులో ఉన్నవాళ్లమంతా మా స్థానాలనుండి లేచేం. న్యాయస్థానమంతా క్రిక్కిరిసి ఉంది. ఒక్కసారి అందరి ముఖాలూ పరీక్షించేను. అందరి దృష్టులూ న్యాయపతివైపు కేంద్రీకరింపబడి ఉన్నాయి. తీర్పునిమిత్తమై ఆతురతతో చూస్తూ నిలుచున్న ఆ సమూహంవైపు చూడ్డానికి నా కెందుకో అయిష్టత కలిగింది. ఒక ప్రాణి చావు బ్రతుకులు ఆ క్షణంలో వెల్లడవుతాయి. దానిగురించి యింతమందికి ఆతురత ఎందు కనిపించింది. అది మానవప్రకృతి. 'అంచేత దానిగురించి ఆలోచించడం అవివేకం' అని న్యాయపతివైపు చూచేను.

'అపరాధినేరం సక్రమంగా విచారించబడి ఆ అపరాధానికి ఫలితంగా ఉరిశిక్ష విధించడమయినది. అతని ఆత్మకు పరమేశ్వరుడు శాంతి చేకూర్చుగాక!' అన్న పలుకులు ఆ నిశ్శబ్దాన్ని భేదించుకుంటూ వచ్చేయి. కోర్టు ముగిసింది. న్యాయపతి నిశ్చలహృదయంతో తన విధ్యుక్తధర్మం నెరవేర్చే నన్న ఆత్మశాంతితో స్థానం దిగి వెళ్లిపోయేడు. అరనిమిషంలో న్యాయస్థానం జనశూన్య మయింది. కాని డాక్టర్ శాంతిసాగర్ విచారవదనంతో ముఖంమీద ఉన్న చెమటబిందువులను తుడుచుకుంటూ తల వంచి నిలుచున్నాడు. ఆ వైద్యవిజ్ఞానశాస్త్రజ్ఞుని అక్కడ చూచేసరికి నా కాశ్చర్యం కలిగింది. డెబ్బదిఏళ్ల ముదుసలి ఒక సామాన్యఅపరాధివిచారణ చూడ్డానికి వచ్చేడంటే చాలా ఆశ్చర్యం కలుగకమానదు. నేను ఆయనవైపు చూస్తూ నిలబడ్డాను. 'సార్జెంట్, నేనొకసారి బందీని చూడాలి. వీలుందా?' అన్నారు శాంతిసాగరులు. ఆ మహాత్ముని కోరిక నిరాకరించడానికి ఎవరికి శక్తి ఉంది? సార్జెంటు ఆయనకు నమస్కారం చేసి 'ఇలా దయచేయండి' అన్నాడు. సార్జెంటు త్రోవ చూపిస్తూ ఉంటే నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఆ గంభీరుడు నడుస్తున్నాడు. ఆ పండువెంద్రుకల ముదుసలికి అపరాధిపై యింత అభిమాన మెందుకు కలగాలి? అన్న ప్రశ్న నన్ను కదిలించి నా కుతూహలం రేకెత్తించింది. మహామహులు సైతము యీయనసింహద్వారమువద్ద కావలికాచుకొని ఆయనదర్శనార్థమై పడిగాపులై ఉంటారే, అటువంటి మహాశయుడు తను స్వయంగా ఒక సామాన్యబందీని చూడ్డాని కని అంత ఎందుకు కుతూహలపడుతున్నాడని పరిపరివిధాల నా ఆలోచనలు పోతున్నాయి. వారిద్దరూ ద్వారం దాటారు. ఒక్కసారిగా నాకూ ఆయనవెంబడి వెళ్లాలనిపించి రెండడుగుల్లో వారిని కలుసుకున్నాను. నేను రావడానికి వీల్లేదని సార్జెంటు వినయపూర్వకంగా చెప్పేడు. నేను చేసేది లేక న్యాయస్థానంపైకి వచ్చి శాంతిసాగరుల రాకకై వీక్షిస్తూ నిలుచున్నాను. అపరాధిని పోలీసులారీలో ఉంచేరు. సాగరులు లారీదగ్గరగా వెళ్లి అపరాధి ముఖంలోకి చూచి తన మృదుహస్తాలతో అతని భుజం తట్టేరు. బందీ తన అపారమైన కృతజ్ఞతను వెల్లడిద్దామని కాబోలు ఆయనను ఆలింగనము చేసుకుందామనుకున్నాడు. కాని చేతులు శృంఖలాలతో బంధింపబడ్డాయి. అతని ముఖం విషణ్ణమైంది. ఒక నమస్కారం చేసేడు. సాగరులు నెమ్మదిగా ముఖం అవతలవైపుకు త్రిప్పి మెల్లగా అడుగులు వేసుకుంటూ కారులోకి వెళ్లి కూర్చున్నారు. పోలీసులారీ శరవేగంతో కోర్టువెనకవైపునుండి వెళ్లిపోయింది. ప్రక్కనించి గంభీరంగా పోతూ ఉన్న శాంతిసాగరుల కారును చూస్తూ నిలుచున్నాను. కారు మలుపు తిరిగి రాజబాటమీదకు పోయింది. ఇక నేను ప్రపంచంలో

పడ్డా. ఆనాడు సేకరించిన వార్తలు నా పత్రికాసంపాదకులకు అందజేయాలి. ఆ ఆతురతతో ఆఫీసుకు చేరుకున్నా.

౨

నేను 'శాంతిభవనము' చేరుకునేసరికి రాత్రి పదిగంటలు కొట్టేయి. మెల్లగా అడుగులు వేసుకుంటూ గార్డెనుదాటి పోర్టికోలోకి వచ్చి నిలుచున్నా. 'శాంతిభవనం' పేరుకు తగినట్టు ప్రశాంతంగా ఉంది. నా అలికిడికి ఎవరూ పైకి రాలేదు. శాంతిసాగరుల 'స్టడీరూమ్' నుండిమాత్రం కిటికీ ద్వారా వెల్తురు ప్రసరిస్తూ ఉంది. శాంతిసాగరులు ఏదో పనిచేస్తూ ఉన్నారని అనుకున్నా. కాని లోపలికి వెళ్ళడానికి ముందుగా కబురుచెయ్యవలసుంది. కాని నౌకర్లెవరూ అక్కడ కనపడలేదు. నాకు ఆతురత ఎక్కువై హాల్లోకి వెళ్ళేను. కొంచెం కునుకుపాట్లు పడుతున్నా. తోటమాలి నా కాలిచప్పుడు విని తొందరగా వచ్చి 'ఎవరువా 'రని ప్రశ్నించేడు. నేను శాంతిసాగర్లను చూడడానికి వచ్చేనని చెప్పేను. అతడు చాలరాత్రి అయిందికాబట్టి ఇప్పుడు ఆయనను చూడడానికి వీ ల్లేదు, మర్నాడు రమ్మన మన్నాడు. 'అలా కాదు, నువ్వు వెళ్ళి యీ విజిటింగుకార్డు యియ్యి' అన్నాను నౌకరుతో. 'ఇప్పుడు లాభం లేదు. రేపు ఉదయం రండి' అన్నాడు మూర్ఖంగా. ఆతని మూర్ఖత్వానికి నాకు విసుగు కలిగి కోపంగా అన్నాను: 'నేను ఆయనను యిప్పుడు చూడక తీరదు' అని. నా మాటలు యింకా పూర్తి అయినవో లేవో శాంతిసాగరులు తన గది గుమ్మందగ్గర నిలుచుని 'రఘూ, నన్ను చూడ్డానికి వచ్చినవారితో అంత ప్రసంగం ఎందుకు? ఆయనను లోపలికి రానీ' అన్నారు. నేను ఆయనకు వినయపూర్వకంగా నమస్కారం చేసేను. రఘూ, "బాబుగారిని యీ సమయంలో ఆయాసపెట్టడం యిష్టంలేక మిమ్మల్ని రేపు రమ్మన్నానుకాని మరొక ఉద్దేశంచేత కాదు" అని వంగి నమస్కారం చేసి పోర్టికోలోకి వెళ్ళిపోయేడు.

నేను శాంతిసాగర్ల 'స్టడీరూమ్'లోకి వెళ్ళి ఆయన కెదురుగా నిలుచున్నాను.

'మీ రెవరు? మీకు నే నేమైనా సహాయం చెయ్యగలనా?' అన్నారు నా ముఖంలోకి చూస్తూ. 'నా పేరు శిరీష్. నేను 'హెరాల్డు' పత్రిక చీఫ్ రిపోర్టరును. మీదగ్గర ఒకవిషయమై తెలుసుకుందా మని వచ్చేను. నా కోరిక మన్నించి నాకు సహాయంచేస్తా రని తలుస్తాను' అన్నాను. ఆయన నా మాటలు పూర్తిగా అయేవరకూ విని తల ఊపుతూ 'పత్రికలకు నే సహాయం చేయగల సమర్థుడను కా దనుకొంటాను. కాని నే చేయగల సహాయ, మేదైనా ఉంటే తప్పక చేస్తాను. విషయం చెప్పండి' అన్నారు. అని, ఆయన ఒక సోఫామీద కూర్చుని నన్ను ఎదురుగా ఉన్నమరొక సోఫాలో కూర్చోమన్నారు. ఆ మహనీయుని ఆదరణ, సౌజన్యం నన్ను ఆకర్షించి ఆనందింపజేసేయి.

'మీరు చెప్పవలసిన విషయం సావధానంగా చెప్పండి' అన్నారు ఆయన.

'దీనానాథునికి యివాళ ఉరిశిక్ష విధించడమైంది. ఆతనిగురించి మీ కేమైనా తెలుసునేమో అడుగుదా మని వచ్చేను' అన్నాను—ఆయనముఖం తదేకదీక్షతో చూస్తూ. ఆయన నిశ్చలు డనీ, గంభీరు డనీ అప్పుడు తెలుసుకున్నాను.

'దీనానాథుని గురించి మీ కేమని చెప్పను. అతడు త్రికరణశుద్ధిగా నమ్మిన ఒక రాజకీయసూత్రానికి బలి అయ్యాడు. ప్రభుత్వంపై జరిగిన దురాచారాలకు అతడే కారణభూతు డని న్యాయస్థానంలో విచారించబడే ఉరిశిక్ష విధించబడ్డాడు. కాని అతడు మాత్రం అమాయకుడు. నిర్దోషి. ఒక నైతికఆదర్శానికి తన జీవితాన్ని నేడు బలి యిస్తున్నాడు. న్యాయస్థానం ధర్మాన్ని ప్రసాదించలేకపోయింది. ఇంతకన్న ఆతనిగురించి నేనుమాత్రం ఏమని చెప్పగలను?' అన్నారు శాంతిసాగరులు. ఆయనమాటలు స్పష్టంగా విచారాన్ని తెలియపరుస్తున్నాయి. సమయంకాబట్టి నేను వెంటనే అన్నా—'మహనీయుల కంతకన్నా ఎక్కువ తెలుసు. ఆతని జీవితచరిత్రనుగురించి మిమ్మ ప్రశ్నింపవచ్చేను. మిమ్మ కోర్టు ముగిసినతరువాత బందీతో మాట్లాడుతున్నప్పుడు బందీనిగురించి ప్రశ్నించి

నప్పుడు నేను మీ ప్రక్కనే ఉన్నాను. మీ విచార వదనం నన్ను ఎందుకో కలతపెట్టి నా కుతూహలాన్ని పురికొల్పింది. అతని జీవితచరిత్ర మీదగ్గరనుండి తెలుసుకుందామని'.

శాంతిసాగర్లు మౌనంతో అంతా విని అన్నారు. 'ఔను శిరీష్ మహాశయా. అపరాధిజీవితచరిత్ర ఒక విచిత్రగాథ. అంతకంటే విచిత్రమైంది అతని అపరాధవిచారణ. నీ కా చరిత్ర వినాలని కుతూహలంగా ఉందా?' అన్నారు. ఔ నన్నట్టు త లూపేను.

ఆయన కూర్చున్న స్థలంనుంచి లేచి ఎదురుగా ఉన్న డ్రాయరునుంచి ఒక పెద్ద తోలుసంచీ పైకి తీసేరు. నాకు ఉత్సాహం ఎక్కువయింది. ఆయన ఎంత నెమ్మదిగా ఉన్నారో నాలో అంత ఆతురత ఎక్కువయింది. ఆయన ఒక ఉల్లిపొరకాగితంలో చుట్టబడిన ఛాయాచిత్రం తీసి నా ముందర పెట్టి పరిశీలించ మన్నారు. నా కేమీ అర్థం కాలేదు. ఇంకొక ఛాయాచిత్రం తీసి నా కిచ్చేరు. రెండిటిని చూచేను. కాని నా కేమీకూడా పాలుపోలేదు. ఆయన నా ముఖంలోకి చూచి 'మీరేమీ యీ విషయం గ్రహించలేరని నాకు తెలుసు. ఇక మీకు విషయంగురించి చెప్తున్నా' అన్నారు. ఆయన యిటూ అటూ పచారు చేయడం ప్రారంభించేరు. ఆ నిశ్శబ్దానికి నేను భంగం కలిగించదలుచుకోలేదు. నా పుస్తకం పెన్సిలు చేత్తో పట్టుకుని ఆయననోటినుండి వచ్చేమాటకు క్షణం ఒక యుగంగా లెక్కిస్తూ కూర్చున్నాను. శాంతిసాగర్లు చెప్పడం ప్రారంభించేరు.

## 3

ఈ రోజునకు సరిగ్గా ముప్ఫైయైదుసంవత్సరములక్రిందట నా వార్డులో కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నాను. రాత్రి పండ్రెండుగంటలు వినిపించేయి. నే నలా ఆలోచనలో ఉండగా వార్డునర్సు ఆతురతతో పరుగెత్తి వచ్చింది. ఆమె భయం, ఆతురత చూచి ఎవరైనా రోగి మరణించేడేమో అని ఆమె ముఖంలోకి చూస్తూ ఆమె చెప్పబోయేదాని కని ఎదురు చూస్తున్నా. 'డాక్టర్, మీరు త్వరగా రావాలి. మొన్న హాస్పిటల్ ప్రవేశించిన అనాథయువతి చాలా బాధపడుతూంది. ఆమె ఒక కవలపిల్లల జంటను ప్రసవించింది. కాని యింకా నొప్పులబాధ తగ్గలేదు. మా కేం చెయ్యడానికీ పాలుపోవటం లేదు' అని గుక్కతిప్పకుండా చెప్పింది. మరి మారు పలక్కుండా ఆమెదగ్గరకు తీసుకువెళ్లమన్నా. నేను ఆమె ప్రక్కదగ్గరకు వెళ్లకమునుపే ఆమె యింకొక మగశిశువును ప్రసవించి అంత్యనిశ్వాసాన్ని విడిచింది. ఆమె కింక నా ఉపయోగం లేదు. ఆమెప్రక్కవైపు చూసేను. ముగ్గురు మగశిశువులు 'క్యావు' మని ఏడుస్తున్నారు. వారి జన్మప్రారంభదశలోనే వారి భావి సూచించబడిందా అనిపించింది. నర్సువైపు తిరిగి అడిగేను 'ఈ పిల్లల తండ్రి ఎవ?' రని. 'ఆమెపతి మాసందినములక్రిందట మరణించేడుట' అంది నా ప్రశ్నకు ప్రత్యుత్తరంగా. తిరిగి ఆ శిశుత్రయంవైపు చూచేను. గుక్క త్రిప్పకుండా వారలా ఏడుస్తూనే ఉన్నారు. ఆ మాతాపితృవిహీనులను చూస్తూ ఉంటే నా కదేమో ఒక జాలి కలిగింది. ఇంక ఆ బిడ్డల రక్షణ ప్రభుత్వం భరించాలి. కాని ప్రభుత్వం భరిస్తుందా? భరించదు. ఇం కప్పుడు ఆలోచించి ప్రయోజనము లే దని ఆ తల్లియొక్క మృతశరీరాన్ని మార్చ్యురీకి తీసుకువెళ్లమని చెప్పి ఆ ముగ్గురు శిశువులను స్టీఫ్‌నర్సు ఆదరణలో ఉంచమని నా డైరీ వ్రాసేందు కని తిరిగి నా వార్డుకు చేరుకున్నాను.

ఆ మరునాడు ఉదయం గతరాత్రి నే చూచిన సంగతి నంతా ఆలోచించుకుంటున్నాను. నా కెందుకో ఒక తీరని అభిమానం, ప్రేమ కలిగేయి ఆ శిశువుల మీద. మొదట ఉద్భవించిన కవలజంటమీదకంటే మూడవశిశువుమీద నా కెందుకో అవ్యాజమైన ప్రేమ కలిగింది. ఇప్పుడు ఆ విషయంగురించి ఊహిస్తే బహుశా ఆ ఆఖరుశిశువు ఏకాకి అనిన్ని, ఆ కవల జంట ఒకరికి ఒకరు సహాయభూతు లవుతా రనీ అనిపించడంవల్ల ఆ మూడవశిశువు భావిని జాగ్రత్తగా గమనించాలని అనుకున్నాను. ముగ్గురూ అరనిమిషం తేడాలో ఒకే ఒక మాతృగర్భాన్ని జన్మించేరు. అంచేత ఆ ముగ్గురిభావి ఏవిధంగా ఉంటుందో చూద్దా మని

కుతూహలం ఎక్కువైంది. వారి నడవడి, ప్రకృతి ఏ విధంగా మారుతాయో చూద్దామన్న వాంఛ ప్రబలమవడంచేత ఆ ముగ్గురు శిశువుల పోషణ నా దృష్టిలోంచి పోకుండా చేద్దామన్న ఉద్దేశంతో ఆ బిడ్డలను ఎవరి సంరక్షణక్రింద ఉంచుదామా అన్న తలంపు నాకెక్కువయింది. నా ఆంతరంగికమిత్రు లెవ్వరిదగ్గరైనా ఉంచుదామా అనిపించింది. కాని ఆ ఉద్దేశం బాగులేదనిపించింది. నా ఆలోచన లేమీ పాలుపోవటంలేదు. ఇంతలో స్టేఫ్‌నర్సు నాదగ్గరకువచ్చింది.

ఆమెవైపు ప్రశ్నపూర్వకంగా చూచేను. 'డాక్టర్, లేడీ మహ్మదీబీగమ్ ప్రసవించింది. కాని మృతశిశు వవడంవల్ల ఆమెకు తెలివి వచ్చినతరువాత ఏమని చెప్పాలో బోధపడటం లేదు. మీరు ఆమెను ఓదార్చడానికి రావలసి ఉంటుంది' అంది ఆమె.

'సర్ మహ్మద్ ఎక్కడ ఉన్నా' రని నే ప్రశ్నించేను.

'ఆయన అమెగదిగుమ్మంవద్ద విచారంగా కూర్చున్నారు' అంది.

న న్నాయనదగ్గరకు ఆక్షణమే తీసుకుని వెళ్లమన్నాను. సర్ మహమ్మద్ చాలా దీనంగా నావైపు చూచేడు. లేకలేక అతనికి యీ సంతానం కలిగింది. కాని ఆ మృతసంతానం మరింత హృదయవేదన కలిగించిం దాయనకు. నేను సర్ మహమ్మదును ఏకాంతంగా మాట్లాడవలసి ఉంటుం దని పిలుచుకొని తీసుకు వెళ్లేను. 'సర్ మహమ్మద్, మిమ్మలను యీ సమయంలో ఓదార్చవలసినవాడను కాను. కాని బీగమ్ విషయం మీ రాలోచించవలసుంది. ఆమె కింకా తెలివి రాలేదు. ఆమె యీ మృతశిశువునుగురించి విన్నట్టయితే చాలా దుఃఖిస్తుంది. కాబట్టి నిన్ననే ఒక అనాథయువతి ముగ్గురు శిశువులను ప్రసవించింది. ఒక శిశువును ఆమెప్రక్కలో పరుండబెట్టడానికి మీ అనుజ్ఞ ఉంటే మా కభ్యంతరము లేదు' అన్నాను. సర్ మహమ్మద్ నావైపు చూచేరు. ఆ చూపుల్లో ఒక ఉత్సాహం, ఒక శాంతం కనిపించేయి. వెంటనే స్టేఫ్‌నర్సుతో ఒక శిశువును తీసుకొనివచ్చి ఆమె ప్రక్క నుంచమన్నా. ఆమె కవలజంటలో ఒక శిశువును మహమ్మదీబీగముదగ్గర ఉంచింది. ఆ మహమ్మదీయదంపతుల ఆనందం నేను చెప్పలేను. వారి ఆనందంలో నా ఉత్సాహంకూడా కలిసింది అని చెప్పక తప్పదు. నా ప్రయత్నాల్లో ఒక సోపానాన్ని ఎక్కేను. తక్కిన యిరువురు శిశువులను ఏమిచెయ్యనా అన్న ప్రశ్న ప్రబలమైంది. నే నీ ఆలోచనలో ఉన్నప్పుడు హోలీవర్జిన్ కాన్వెంటు ఫాదర్ ఏండ్రూస్ కాన్వెంటులో పిల్లలకు కొంతమందికి సుస్తీ చేసింది చికిత్స చెయ్యమని అడగడానికి వచ్చేడు. 'ఫాదర్ ఏండ్రూస్, నేను మిమ్మలను ఒక కోరిక కోరవలసుంది. దానిని మన్నిస్తారా?' అన్నాను. ఏండ్రూస్ నవ్వుతూ అన్నాడు 'డాక్టర్, ఇవాళ మీరు చాలావింతగా మాట్లాడుతున్నారు. మీరు అడక్క అడక్క అడిగిన కోరికనే మన్నించలేనంత కృతఘ్నుడను కాను. కాని నా వశంలో ఉన్నదైతే నేనే చెయ్యగలను' అన్నాడు.

'ఫాదర్, మీకు మీ శరీరసంతానం లేకపోయినా, అనేకఅనాథబాలబాలికలకు మీరు పితృసమానులు. కాబట్టి మిమ్మ నే నడిగే కోరికకూడా ఒక అనాథశిశువుసరించే' అన్నాను.

'డాక్టర్, దాని కింత ఆలస్యం చేయవలసిన అగత్యం లేదు' అన్నారు ఫాదర్ ఏండ్రూస్.

స్టేఫ్‌నర్సుకు కబురు చేసేను, రెండవ కవలజంటలో శిశువును తీసుకురమ్మని. ఆమె ఆ శిశువును ఫాదర్ ఏండ్రూస్‌చేతి కిచ్చేను. చిరునవ్వు నవ్వుతూ అన్నాడు ఫాదర్—'డాక్టర్, యీ శిశువు ఒక ఉన్నతపదవికి వస్తాడు!' ఏండ్రూస్ వెళ్లిపోయేడు. రెండవసోపానం ఆరోహించేను. ఇక మూడవశిశువు సమస్య మిగిలిపోయింది.

ఆ రోజుకు ఆ సమస్య తేలలేదు. మర్నాడు మామూలుగా హాస్పిటలుకు చేరుకున్నాను. ఒకసారి వార్డంతా యిన్‌స్పెక్ట్‌చేద్దామని స్టెతస్కోప్ తీసుకుని బయలుదేరేను. మామూలుప్రకారం పేషెంట్సులందరి యోగసమాచారాలు కనుక్కుందామని బయలుదేరేను. పదిగజాలదూరం ఇంకా వెళ్లకమునుపే 'బాబూ, డాక్టరుబాబూ' అన్న పిలుపుతో వెనక్కి చూచేను.

నన్ను పిలిచినతను జలోదరంతో బాధపడుతున్న ఒక రైతు. అతడు బ్రతికే విధానం లేదు. కాని మానవ ప్రయత్నం ఎంత ఉందో అంతా మేము చెయ్యవలసిన వాళ్ల మేను. అతణ్ణి చూచినదగ్గరనుండి నా కతనిమీద జాలి వేసింది. అతడు మూడవసారి వివాహం చేసుకున్నాడు; పై యిద్దరుభార్యలు పోవడంచేత. ఆతని భార్య వయస్సు ఇరవై సంవత్సరాలకు మించి ఉండదు. పాపం చాల అమాయకురాలు. ఆమెను చూచినప్పుడల్లా ఆమె భవిష్యత్తంతా ఒక నిస్పృహే కదా అనిపిస్తూ ఉండేది. ఎంత ధనం ఉంటే ఏమి ప్రయోజనం? 'డాక్టరుబాబూ, లచ్చిని మీరు చూచేరా?' అన్నాడు ఆ పెద్దరైతు. చూచే నన్నట్లుగా తలూపేను. లచ్చి అతని మూడవభార్య. 'బాబూ, నేను ముమ్మారు వివాహం చేసుకున్నా నాకు సంతానం లేదు. ఇంక నేను మహా బ్రతికితే రెండు వారాలో, లేక మూడు వారాలో! తర్వాత న న్నామాయదారిరోగం బ్రతుకనీదు. లచ్చిని చూస్తే నా కడుపు తరుక్కుపోతూంది' అన్నాడు రైతు ఆయాసంతో. అతని మాటలకు నా హృదయం కరగింది. పాపం లచ్చిజీవితం చాలా దుర్భరం. అతణ్ణి ఓదారుద్దామని ఏదో చెప్పబోయేను.

'ఒద్దు డాక్టరుబాబూ, నన్ను ఓదారుద్దామని ప్రయత్నం చెయ్యకండి; నేను పిచ్చివాణ్ణి కాను, మీ తియ్యనిమాటలు వినడానికి. ఆ పరమేశ్వరుని ఆజ్ఞ అయింది, ఇక యిహలోకంనుంచి రమ్మని. నిన్నంతా లచ్చి నర్సమ్మతో మాట్లాడుతూంది. ఎవరో ఒక అనాథస్త్రీ ముగ్గురు శిశువులను ప్రసవించి మరణించిందట. అందులో యిద్దరని అప్పుడే ఎవరో గొప్పవారికి మీరు యిచ్చేరట. మూడవపిల్లవాడిని మాత్రం తనకిమ్మని అడుగుతూంది. బాబూ, లచ్చి అమాయకురాలు. బిడ్డను వెయ్యికన్నులతో చూచుకుంటుంది. నా కులం నిలబెట్టినవాళ్లవుతారు, ఆ శిశువును మాకు ప్రసాదించరూ?' అని నా గడ్డం పట్టుకున్నాడు. నా ఆనందానికి పరిమితి లేదు. మూడవశిశువును లచ్చి ఒళ్లో పెట్టేను. లచ్చి ఆనందంతో హిమగిరిశిఖరం ఎక్కింది. ఆ రాత్రే రైతు మరణించేడు. కాని లచ్చి ఏమీకూడా చలించలేదు. ఆమె అప్పుడే మాతృవేదికను చేరుకుంది. నేను మూడవ సోపానం ఎక్కడమయింది.

శాంతిసాగరులు పచారుచేయడం మాని మరొకసారి ఛాయాచిత్రంవైపు చూచేరు. నేను వడివడిగా నా ఉచ్ఛ్వాసనిశ్వాసాల్ని తీసుకుంటున్నాను శాంతిసాగరులు తిరిగి ప్రారంభించేలోపుగా.

౪

శిరీష్ మహాశయా, యీ విధంగా ఆ మువ్వురు శిశువుల పోషణా మూడుమతాలకు అర్పించేను. నేను వారి నలా ఇంకొకరి పోషణలో వదలినప్పటికీ తరచు చూస్తూనే ఉన్నాను. వా రందరిలో నాకు పరిచయం ఎక్కువ యీ మూడవశిశువుతో. లచ్చి కుర్రవాడిని పెంచి పెద్దవాడిని చేసింది. ఆరవ ప్రాణంక్రింద చూచి పెంచుకొంది ఆ అనాథశిశువును. ఆతడు అనాథశిశువైనా లచ్చిమాత్రం ఆతడికి దీనానాథుడని నామకరణం చేసింది. పేరుకు తగినట్టుగానే అతడు సంచరించెను. నేను మాసానికి ఒక పర్యాయం వారి గ్రామం వెళ్తూ ఉండేవాణ్ణి. లచ్చి పొలంలో కూలీల చేత పని చేయిస్తూ ఉంటే గుడ్డఉయ్యాలలో కూర్చుని నవ్వుతూ ఉన్న నాడు అపరాధిని ఎరుగుదును. ప్రక్క రైతుల పిల్లలతో గూటీబిళ్ల ఆటలు ఆడుతున్నప్పుడు ఎరుగుదును. పొలంలోకి పోయి కూలీలకు ఏతాం ఏ విధంగా తొక్కేదీ నేర్పిన విధం ఎరుగుదును. కుప్పనూర్పులదగ్గర రాత్రింబవళ్లు కూర్చుని కూలీలతోబాటు తనూ కామందైనప్పటికీ సామాన్య పని చేసే రోజుల్లో ఎరుగుదును. లచ్చి వివాహంచేసుకోమని నిర్బంధించినప్పుడు నాదగ్గరకు వచ్చి, 'డాక్టరుబాబూ, నేను మా అమ్మకు వ్యతిరేకం చెప్పలేను. నాకు వివాహం చేసుకుందామని లేదు. నాలో ఏదో ఒక వాణి నన్ను యింకొక పనికి నీవు నియమింపబడ్డప్పుడు నువ్వెలా సంసారంలో యిరుక్కుంటావు' అని చెప్పినట్లు తన మానసంలో ఉండి నాకు పూస గ్రుచ్చినట్లు చెప్పిన రోజులనుండి ఎరుగుదును. లచ్చి ఆకస్మికమరణం నాడు నేను వచ్చి ఆమెను చూచేవరకు మృతశరీరాన్ని దహనం చెయ్యకుండా ఆపినరోజున అతడి ధైర్యస్థైర్యాలను ఎరుగుదును. శిరీష్ మహాశయా, అప

రాధి సామాన్యప్రజ అవగాహనచేసుకునేటటువంటి వ్యక్తి కాడు అన్నారు. శాంతిసాగరులు, ఒక్కొక్క మాటా తమ హృదయభారం వెల్లడింపజేస్తూ.

లచ్చి మరణం ఆతని హృదయంలో ఒక తీరని మార్పు కలిగించింది. లచ్చిని అపరిమితంగా ప్రేమించేడతడు. ఆ ప్రేమైకవస్తువు తన్ను విడిచినప్పుడు ఆతని హృదయం ఒక్కసారిగా చలించింది. కాని దీనానాథుడు మహత్తరమైన శక్తిమంతుడు. జీవితం మొదటనుండి అతడు ఒక ఆధ్యాత్మికకర్మతత్త్వానికి అంకితం చెయ్యడంమూలాన లచ్చిమరణం అతడు చూచినప్పటికీ నిశ్చలుడై తన నైతికఆదర్శానికి జీవితం బలిగా యివ్వడానికి సంసిద్ధుడయ్యేడు. లచ్చి చనిపోయిన మరునాడు అతడు నాదగ్గరకు వచ్చి అన్నాడు: 'డాక్టరుమహాశయా, నేను ఒకే ఒక వస్తువును మొదటినుండి ప్రేమించడంవల్ల ఆ వస్తువు యొక్క ఆకస్మికనాశనం నన్ను పిరికివాడుగాను, అవివేకిగాను చేసింది. అంచేత అన్నివస్తువులను ప్రేమించడం ఉత్తమమని తోస్తుంది. సర్వమానవప్రేమ ముందు మానవునికి దుఃఖం ప్రాప్తించదు అనుకుంటాను. అంచేత నేటినుండి నా నైతికగమ్యం మార్చుకుంటాను' అన్నాడు. ఆతని మనోభీష్టము అప్పుడే గ్రహించేను.

శాంతిసాగరులు తలను కొంచెం వంకించేరు, ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లు. నాకు ఆశ్చర్యం కలిగింది ఆయనమాటలు వింటూఉంటే. దేశమంతటా ఒక మహావిజ్ఞానశాస్త్రజ్ఞుని అని పేరుబడ్డ శాంతిసాగర్ల జీవితంలో రెండవముఖంకూడా ఉందా అన్న సంగతి ప్రపంచానికి తెలియదు. మహాత్ముల జీవితాలన్నింటికీ ఒక వెలుగు నిచ్చేవి యిటువంటి వ్యక్తిగతసుహృద్భావములే అన్న మాటల్లో సత్యం నేడు శాంతిసాగర్లకు దీనానాథునిమీద ఉండే అవ్యాజప్రేమే నిరూపిస్తూంది. ఆ ముదుసలిగంభీరవదనంలో నింత శాంతి సహనా లున్నాయా అని తదేకదీక్షతో ఆయన ముఖంలోకి చూస్తున్నా మంత్రించబడ్డవానికిమల్లే.

'సంవత్సరాలు గడిచేయి' అని ప్రారంభించేరు శాంతిసాగర్లు. కర్షకజనంయొక్క హక్కులనుగురించి ఆందోళన చేయడం ప్రారంభించేడు దీనానాథుడు. ప్రభుత్వంతో తెగనిపోరాటం సాగించేడు. దేశానికి వెన్నెముకైన గ్రామజీవనాన్ని, రైతుజీవితాన్ని నీచంగా చూడొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించుతూ వచ్చేడు. కర్షకప్రజ అంతా దీనానాథుని ఒక దైవం కింద పూజిస్తూవచ్చేరు. ఈ విషయం దీనానాథునికి విచారం కలిగిస్తూవచ్చేది. ఆతడు యీ కర్షకఉద్యమంలో దిగినప్పటినుండీ మే మిద్దరం కలసుకోవడం తరచు జరిగేది కాదు. కాని కలిసినప్పుడుమాత్రం తన హృదయం అంతా నా కర్పించేవాడు. 'డాక్టరు బాబూ, కర్షకప్రజ చాలా అమాయకంగా తరతరాల నుంచి పెరుగుతూవచ్చింది. వారికి సహాయంగా నిలబడ్డ ప్రతీవ్యక్తిని ఒక దైవంగా భావిస్తుంది. ఎంత పొరబాటని చెప్పినా వినదు. కర్షకుల్లో ఆత్మవిశ్వాసం కలిగితేనేకాని యిటువంటి మూఢనమ్మకం పోదు. ఇది ఉన్నంతకాలం కర్షకఅమాయకత్వాన్ని గ్రహించిన వ్యక్తులు తమ స్వలాభంగురించి కర్షకజనాన్ని ప్రభుత్వాహంకారానికి బలిగా చేస్తున్నారు, చేస్తారు. ఇది నన్ను చాలా బాధపెడుతూంది' అన్నాడు దీనానాథుడు. ఆతని నైతికబలం నాకు ద్యోతకమయింది ఆనాడు. ఆతని జీవితాన్ని అమరపదం అలంకరింపజేస్తుం దన్న దృఢనమ్మకం కలిగింది. కాని విధి అడ్డు తిరిగినప్పుడు మహాత్ములుకూడా లొంగవలసిందే. మొన్న ప్రభుత్వంపై జరిగిన దురాచారాలన్నీ ఒక పేరుగా గ్రుచ్చి దీనానాథునిమీద నిందగా ఆరోపింపబడింది. ఆ దురాచారాలకు కారణభూతులైన ప్రభుత్వోద్యోగులు తమ స్వేచ్ఛకు భంగం లేక విలాసంగా కాలం గడుపుతూనే ఉన్నారు. కాని అమాయకుడైన ఒక జీవిని బలిచేయడానికి సమకట్టి తమ కార్యాన్ని సాఫల్యంచేసుకున్నారు. అపరాధిఅపరాధం నిశ్చలమైన హృదయంతో ఒక నైతికరాజకీయసూత్రాన్ని అవలంబించడమే! శిరీష్‌మహాశయా, అపరాధి నాతో ఒకనాడు చెప్పినట్లు, నైతికఆదర్శాన్ని మనం పొందాలంటే మన భౌతికజీవితం బలిగా చెయ్యాలి అన్న మాట సత్యం.

శాంతిసాగర్లు ముఖం తుడుచుకున్నారు. ఆ ముడుతలు పడిన చెక్కిళ్లనుండి రెండు కన్నీటిబిందువులు ముత్యాల్లా రాలేయి.

నేను మౌనం వహించేను. శాంతిసాగర్లు మాట్లాడలేదు. కాలం పరుగెడుతూంది. నా కుతూహలాన్ని అరికట్టలేక తక్కిన యిరువురు శిశువుల మాట ఏమైంది అన్నాను.

శాంతిసాగర్లు నా ముఖంలోకి చూచేరు. 'చెప్పడం మరచేను. సర్ మహమ్మద్‌కి యివ్వబడిన శిశువు వారింటనే వారి మతాచారాల్లో పెంచబడ్డాడు. ఆ దంపతులకు అతనిమీద అవ్యాజమైన ప్రేమ. నేడు అతడు మన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్' అన్నారు శాంతిసాగరులు. నాకు ఆశ్చర్యం కలిగింది. నేను నా ఆశ్చర్యం పట్టలేక "మహాత్మా, మహమ్మద్ మెహర్బానీ, అపరాధి సోదరుడా?" అన్నాను ఆవేశంతో. 'ఔనన్నట్లు తలూపేరు శాంతిసాగర్లు. 'ఇక మూడవయాతడు' అన్నా ఇంకొక ఆశ్చర్యకరమైన వార్త వినడానికి. 'ఫాదర్ ఏండ్రూస్ తన స్వదేశం వెళ్లిపోతూ తనకిచ్చిన శిశువును ఇంగ్లండ్ తీసుకువెళ్లిపోయేడు. ఆ శిశువు ఆంగ్లదేశంలో పరీక్షలందు ఉత్తీర్ణుడై ఆంగ్లప్రభుత్వంచేత న్యాయపతిగా యీ దేశం పంపబడ్డాడు. అతడే మన న్యాయపతి.' అన్నారు శాంతిసాగర్లు. నా ఆశ్చర్యానికి మేర లేదు. వర్జిన్ ప్రెజంట్ అపరాధి రెండవసోదరుడు. నే నుండలేక అన్నా—'శాంతిసాగర్ మహాశయా, చివరకు సహోదరులే హంతకు లయ్యేరా!' అని. 'కాదు శిరీష్‌మహాశయా, ఎవరికి వారు వారివారి విద్యుక్తధర్మాన్ని నిర్వర్తించేరు. అనాథయువతికి జన్మించిన సంతానం వారు. వారివారి జీవితగమ్యం ఏ విధంగా మారిందో చూచారా? ఏకోదరులైనా ఏకకాలజన్ములైనా జీవితంలో ఎటువంటి వేరువేరు మార్గాలు ఆదర్శంగా పెట్టుకొని నడుస్తున్నారో చూచేరుగదా? నే ననుకున్నట్లు ఆ కవలజంట ఒకరికి ఒకరు సహాయు లయ్యేరు. న్యాయపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్. ఇక మూడవ శిశువు నే ననుకున్నట్లు ఏకాకి అయ్యేడు. కాని ఆతని నైతికఆదర్శం ముందు తక్కినవారిద్దరి జీవితాలు అణుమాత్రాలు' అన్నారు శాంతిసాగర్లు.

గోడమీద ఉన్న గడియారం ఒంటిగంట కొట్టింది. నేను తొందరగా లేచి అన్నా—'మహాశయా, దీన్ని ప్రచురించడానికి అనుమతి యిస్తారా?' అని. శాంతిసాగర్లు మందహాసం చేసేరు. 'అభ్యంతరం లేదు. కాని శీర్షికమాత్రం! 'ఏకోదరు' లని పెట్టండి' అన్నారు. నేను సెలవు తీసుకుని ఒక నమస్కారం చేసి రెండడుగులు వేసేను. 'శిరీష్ మహాశయా, మీరు ఆ విధంగా ప్రచురిస్తే లాభం లేదు. మీమీద తరువాత చర్య తీసుకోవడానికి వీలుంది. కాబట్టి ఇదుగో యీ డైరీ తీసుకోండి. ఈ ఛాయాచిత్రాలను తీసుకోండి' అన్నారు. నేను ఆ మహాత్ముని ఆదరణకు ఏమి ప్రత్యుత్తరం చెప్పాలో తెలియలేదు. సంతోషంతో 'డైరీ' తీసుకున్నా. ఛాయాచిత్రాలను తీసుకుంటూన్నప్పుడు అన్నారు ఆయన—'ఒక ఛాయాచిత్రం' ముగ్గురు శిశువులు మరణించిన తల్లితో ఉన్న దృశ్యం; రెండవది ఏ బిడ్డ ఎవరికి ఇచ్చినప్పుడు బిడ్డతోసహా వారిని తీసిన ఛాయాచిత్రం. కవలజంటలో ఎర్రటి పుట్టుమచ్చ చెక్కిలిమీద ఉన్న బిడ్డ ముస్లిందంపతులకు ఇవ్వబడ్డాడు. కంఠంమీద ఎర్రటిమచ్చ ఉన్నతను ఫాదర్ ఏండ్రూస్‌కు ఇవ్వబడ్డాడు. మూడోఅతనికి మచ్చ ఎక్కడా లేదు.' అన్నారు శాంతిసాగర్లు. నేను ఆయనకు ఒకసారి నమస్కారం చేసి ఆయన అరచేతులను కళ్ల కద్దుకొని పైకి వచ్చేను.

కాలం శరవేగంతో నడుస్తూంది. ఆఫీసుకు పరుగెత్తేను. మర్నాడు పత్రికలో యీ చరిత్ర వెల్లడి చెయ్యాలి. ఛీఫ్ అనుమతిమీద ప్రచురించడం కష్టం లేకపోయింది. ఛీఫ్ నన్ను చూచి ఆనందం పట్టలేకపోయేడు. ఈ చరిత్ర విని తన్నే నమ్మలేకపోయేడు. డైరీ, చిత్రాలు చూచినతరువాత ఊపిరి తీసుకున్నాడు.

ఉదయం ఏడు గంటలకు శాంతిసాగర్లకు పత్రిక స్వయంగా చూపిద్దామని పరుగెత్తేను. ఆయన యింకా లేవలేదు. 'బాబుగారు ఇంకా పండుకున్నారు' అన్నాడు రఘు. 'అయినా లేపుదాము

లెండి' అన్నాడు. నేనూ, రఘూ ఇద్దరం శయనమందిరం ప్రవేశించేం. ఆ మహనీయుడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. దగ్గరగా వెళ్లేను లేపడానికని. నా కళ్లను నేను నమ్మలేకపోయేను. మహాత్ముడు శాంతిసాగర్ నిర్విచారమైన దీర్ఘసుషుప్తి చెందాడు. రఘువైపు తిరిగి అన్నాను: 'రఘూ, బాబు మన కిక లేడు.' ఏడున్నర వినిపించింది. దీనానాథుని ఉరి తీయబడింది. నేను నడవలేక హాల్లో కూర్చున్నాను-డాక్టరు శాంతి సాగర్ చిత్రం చూస్తూ. ఆ ప్రక్కనే యింకొక చిత్రం కూడా ఉంది. అది లచ్చి బిడ్డతో తీయించుకున్న చిత్రం. 'ఏకోదరులు' ఆ ముువ్వురు కారు; ఈ యిరువురే అని అప్రయత్నంగా అన్నా. రఘు వచ్చి 'బాబూ, ప్రయత్నం చెయ్యాలి' అన్నాడు. ఇద్దరం పోర్టికోలోకి వచ్చేం.

---

# చిన్న పురుగు

శ్రీ నాళము కృష్ణరావు

అడుగు మోపకు మక్కటా! దుడుకు మీఱి,
దిక్కుమాలిన పురుగును త్రొక్కెదు సుమీ;
నీచముగ నీవు నిరతంబు చూచుచున్న
చిన్ని పురుగును దేవుడే సృష్టి చేసె.

జీవకోటుల నెల్ల సృజించినట్టి
సృష్టికర్తయె నిన్ను సృజించినాడు;
తన యనంతకృపామృతధార నతడు
పురుగుపైగూడ నాతడు దొరగజేసె.

చంద్రసూర్యుల తారకాసముదయముల
సకలజీవుల కాత డొసంగినాడు;
నీవు, పురుగులు నడవంగ నేలమీద
గరికిపోచ తివాచీల బఱచినాడు.

అల్పకాలము మాత్రమే యనుభవించు
చిన్నిసౌఖ్యము దానిని జెందనిమ్ము;
నీ వొసంగగ జాలని జీవములను
ఏల తీసెద వక్కటా! జాలి మాలి?

---